సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం | 9 | డిసెంబర్ | 2023



మా సొమ్ము ఏమైందో..!

కొత్తవలస మండలం చింతలపాలెం ఎస్‌బీఐలో గురువారం రాత్రి దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. - 8లో



వైభవంగా సహస్ర దీపాలంకరణ

రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. - 8లో



21న మొదటి విడత 'నాడు-నేడు' పునఃప్రారంభం - 8లో

ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మొదటి విడత నాడు-నేడు పనులను పునఃప్రారంభిస్తామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు.

న్యూస్‌రీల్

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సమకూర్చినా...

- గిరిజనులకు తప్పని కష్టాలు



డోలీలో బాలింతను తీసుకెళ్తున్న రంగంవలస గ్రామస్తులు

సీతంపేట: మండలంలోని రంగంవలస గ్రామానికి చెందిన సవర సుశీల అనే గర్భిణి ఈ నెల 4 వ తేదీన సీతంపేట ఏరియా ఆస్పత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. వైద్యులు ఆమెను శుక్రవారం డిశ్చార్జ్ చేశారు. స్వగ్రామానికి తీసుకెళ్లేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను సమకూర్చారు. మర్రిపాడు గ్రామం వరకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో క్షేమంగా చేరుకున్నారు. అక్కడ నుంచి కొండపై ఉన్న గ్రామానికి సరైన మార్గం లేదు. ఎటువంటి వాహనాలు వెళ్లలేని పరిస్థితి. చేసేదేమీ లేక భర్త ఆకాష్‌తో పాటు గ్రామస్తులు డోలీలో 7 కిలోమీటర్ల మేర డోలీలో మోసుకుంటూ బాలింతను క్షేమంగా ఇంటికి చేర్చారు.

ఆపన్న హస్తం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: మండలంలోని మొగదార గ్రామానికి చెందిన చీమల ప్రేమ్ అనే మూడేళ్ల బాలుడు గతేడాది విద్యుదఘాతంతో మృతి చెందారు. బాలుడి తల్లిదండ్రులు చీమల మీనా, వినోద్‌లకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ ఎఫ్) నుంచి మంజూరు చేసిన రూ.2లక్షల చెక్కును పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం సీతంపేటలో అందజేశారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు అకాల మరణంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న నిరుపేద కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని పెదరామ సర్పంచ్ తిరుపతిరావుతో పాటు స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన ఆమె సీఎం రిలీఫ్ ఫండ్‌కు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి, సర్పంచ్‌లు తిరుపతిరావు, కళావతి, ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు చంద్రశేఖర్, హరి, మంగయ్య, పార్టీ మండల కన్వీనర్ జి.సుమిత్రారావు, పార్టీ నాయకులు ఎస్.రాము, నిమ్మక కాంతారావు, ఎస్.కృష్ణ, గణేష్, సింహాచలం, భాస్కరరావు, ఎర్రయ్య పాల్గొన్నారు.

వరల్డ్ ఎబిలిటీ పోటీల్లో రూపాదేవి సత్తా



గోల్డ్ మెడల్‌తో రూపాదేవి

రాజాం సిటీ: రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్ఎల్‌టీఎస్ కళాశాలలో డిగ్రీ చదివిన పడాల రూపాదేవి థాయ్‌లాండ్‌లో నిర్వహించిన 2023 వరల్డ్ ఎబిలిటీ పారా బాడ్మింటన్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకూ పోటీలు జరిగాయి. ఇండియా తరఫున ప్రాతినిధ్యం వహించిన రూపాదేవి థాయ్‌లాండ్ జట్టుతో జరిగిన తుది పోరులో ప్రతిభ చూపింది. బంగారు పతకం సొంతంచేసుకుని దివ్యాంగులకు ఆదర్శంగా నిలిచింది. ఆమె స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలంలోని సంతవురిటి. రూపాదేవిని రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వప్నహైందవి, అధ్యాపకులతో పాటు ఎస్ఎల్‌టీఎస్ కళాశాల కరస్పాండెంట్ టి.తవిటినాయుడు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

'ఆడుదాం-ఆంధ్రా'కు
సర్వం సిద్ధం



సీతంపేట సచివాలయానికి చేరుకున్న క్రీడా పరికరాలు

- ఈ నెల 15 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు
- జిల్లాలో 350 సచివాలయాలకు చేరుకున్న క్రీడా పరికరాలు
- ప్రతి సచివాలయం పరిధిలో ప్రత్యేక క్రీడా స్థలం
- జిల్లాలో 6వేల క్రీడా పోటీలకు ఏర్పాట్లు
- ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న క్రీడాకారుల సంఖ్య: 25,032

పార్వతీపురం టౌన్:

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహించేందుకు పార్వతీపురం మన్యం జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 15 నుంచి జిల్లాలోని 350 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. దేశ చరిత్రలో ఇప్పటిదాకా ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మన్యం జిల్లాలో 6వేల పోటీలు జరగనున్నాయి. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విభాగాల్లో పోటీలు సాగనున్నాయి. వీటికి అదనంగా 3కే మారథాన్, యోగా, టెన్నికాయిట్ పోటీలనిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

విజేతలకు నగదు ప్రోత్సాహకాలు

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా 35వేలు, రూ.15వేలు, రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు అందిస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ తృతీయ విజేతలకు వరుసగా రూ.5 లక్షలు, రూ.3లక్షలు, రూ.2 లక్షలు అందజేయనున్నారు.

ముమ్మరంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు 15 సంవత్సరాలు దాటిన ప్రతీ ఒక్కరు అర్హులే. క్రీడల్లో పాల్గొని సత్తా చాటేందుకు గత నెల 27 నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించారు. వార్డు, గ్రామ సచివాలయాల్లోను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకునే వెసులుబాటు కల్పించారు. రిజిస్ట్రేషన్లు చేసుకొనేందుకు యువత పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలోని 15 మండలాల నుంచి 25,032 మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడా పరికరాలు జిల్లా కేంద్రం నుంచి సచివాలయాలకు చేరుకున్నాయి. వాటిని పంపిణీ చేసేందుకు సచివాలయ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు అంబటి రాయుడు, కరణం మల్లీశ్వరి, పీవీ సింధు, డి.హారిక, శ్రీకాంత్, వి.జ్యోతిసురేఖ వంటి వారిని ఆడుదాం-ఆంధ్రాకు బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రకటించి క్రీడా సంబరంలో ప్రభుత్వం భాగస్వామ్యం చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా పోటీలు నిర్వహిస్తోంది. క్రీడల్లో పాల్గొనేవారికి మంచి భోజనం సహా ఇతర సదపాయాలు కల్పించనుంది.



పార్వతీపురంలో కిట్లను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

జిల్లాలో నియోజకవర్గాల వారీగా రిజిస్ట్రేషన్ల వివరాలిలా..

నియోజకవర్గం	రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి సంఖ్య
పార్వతీపురం	6,303
సాలూరు	4,222
పాలకొండ	7,871
కురుపాం	6,636

జిల్లాకు చేరుకున్న పరికరాలు ఇలా..

వివరాలు	పరికరాల సంఖ్య
బేసిక్ క్రికెట్ కిట్-మెన్	700
బేసిక్ క్రికెట్ కిట్-ఉమెన్	350
ప్రొఫెషనల్ క్రికెట్ కిట్-మెన్	30
ప్రొఫెషనల్ క్రికెట్ కిట్-ఉమెన్	15
క్రికెట్ లెదర్ బాల్స్	38
బ్యాడ్మింటన్ నైలాన్ నెట్	350
బ్యాడ్మింటన్ రాకెట్స్ స్టేజ్-1	2100
బ్యాడ్మింటన్ రాకెట్స్ స్టేజ్-2	120
నైలాన్ షటిల్ కాక్ స్టేజ్-1	350
నైలాన్ షటిల్ కాక్ స్టేజ్-2	700
వాలీబాల్ స్టేజ్-1	1050
వాలీబాల్ స్టేజ్-2	90
వాలీబాల్ నెట్	350
కబడ్డీ నీ క్యాప్స్	500
ఖోఖో యాంక్లెట్స్	500
టెన్నీకాయిట్	700
టోపీలు	150
మెడల్స్	1710
సర్టిఫికెట్లు	1710

ప్రణాళికా బద్ధంగా ఏర్పాట్లు



ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు వేశాం. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఆటస్థలాల పరిశీలన పూర్తిచేశాం. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేశాం.
– ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్

194 మైదానాల్లో ఆటల పోటీలు



జిల్లాలో 6వేల పై చిలుకు క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. జిల్లా వ్యాప్తంగా 194 మైదానాలు సిద్ధం చేశాం. దీనికి సంబంధించి క్షేత్రస్థాయి నుంచి అధికారులకు ఆదేశాలు జారీచేశాం.
– ఆర్.గోవిందరావు, జేసీ, ఆడుదాం-ఆంధ్రా జిల్లా నోడల్ అధికారి

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

- పంట నష్టం నివేదికలు రాగానే తదుపరి చర్యలు
- గిరిశిఖర గర్భిణుల వసతిగృహ నిర్వహణ ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..
- బడ్జెట్‌లో నిధుల కేటాయింపునకు కృషిచేస్తా
- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు:

మిచాంగ్ తుఫాన్‌తో పంటలు నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు పట్టణంలోని తన గృహంలో మీడియాతో శుక్రవారం మాట్లాడారు. తుఫాన్‌పై ముందస్తుగా అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అప్రమత్తం చేశారన్నారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అధికంగా పంట నష్టం వాటిల్లిందని, మనవైపు తక్కువ ప్రభావం ఉందని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ముంపునకు గురైన పంటలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలిస్తున్నారని, నష్ట నివేదికలు అందిన వెంటనే ఆదుకునే చర్యలు చేపడతామన్నారు.

గిరిజన గర్భిణులకు ప్రత్యేక వసతి

కొదమ పంచాయతీ సిరివరకు చెందిన గిరిశిఖర గర్భిణిని డోలిలో తీసుకువచ్చిన ఘటనపై జాతీయ మానవహక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసి నాటి టీడీపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిందని రాజన్నదొర పేర్కొన్నారు. ఈ క్రమంలో నాటి ఐటీడీఏ పీఓ డా.లక్ష్మీశా నేరుగా ఆ గిరిశిఖర గ్రామానికి వెళ్లిన క్రమంలో సమస్య పరిష్కానికై వైటీసీలో గిరిశిఖర గర్భిణుల వసతి గృహాన్ని సొంత ఆలోచనతో ఏర్పాటుచేశారన్నారు. ఇది మంచి నిర్ణయం కావడంతో అందరమూ హర్షించామని చెప్పారు. ఎమ్మెల్యేగా వైటీసీ భవన నిర్మాణం పూర్తికి కృషి చేశానన్నారు. గిరిశిఖర గర్భిణుల వసతిగృహ నిర్వహణకు గత టీడీపీ ప్రభుత్వంలో బడ్జెట్ కేటాయింపులు చేయకపోవడం వల్ల అక్కడ పనిచేసిన సిబ్బంది జీతాలకు ఇబ్బందులు వచ్చాయని పేర్కొన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో సీఎఫ్ఎమ్ఎస్ ద్వారా జీతాల చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. వసతిగృహం నిర్వహణ ఆవశ్యకతను వివరించి, రానున్న బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని త్వరలో జరగనున్న క్యాబినేట్ సమావేశంలో ప్రస్తావిస్తానని తెలిపారు. జాతీయహెల్త్ మిషన్ నుంచి నిధులు మంజూరయ్యేలా ప్రతిపాదనలు పంపించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే సంక్షేమం, అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే గిరిజనులకు సంక్షేమ పథకాలు అందడంతో పాటు మన్యంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని డిప్యూటీ సీఎం రాజన్నదొర స్పష్టంచేశారు. గత టీడీపీ ప్రభుత్వం కనీసం గిరిజన సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. తోణాం, మామిడిపల్లి రోడ్లను నిర్మించకుండా వదిలేసిందన్నారు. సాలూరులో వంద పడకల ఆస్పత్రి, కందులపదం బ్రిడ్జి నిర్మాణాలను టెంకాయ కొట్టి విడిచిపెట్టిందని విమర్శించారు. శివరాంపురం వంతెన నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయని, కాంట్రాక్టర్ మరణించడంతో పనులు నిలిచిపోయాయని వివరించారు. తరువాత 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చినా.. స్థానిక నాయకులు సంధ్యారాణి, భంజ్‌దేవ్‌లు వంతె నిర్మాణం పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వంతెన ఆవశ్యకతను తెలియజేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపించామంటూ ఆ కాపీలను రాజన్నదొర విలేకర్లకు చూపించారు. మక్కువ డబుల్ రోడ్డు పనులు జరుగుతున్నాయని, వీటి బిల్లుల గురించి ముఖ్యమంత్రితో మాట్లాడతానని, పనులు త్వరితగతిన పూర్తిచేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మాది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని పునరుద్ఘాటించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరరావు, సూరిబాబు, కౌన్సిలర్లు గిరిరఘు, వెంకటరమణ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం

- సబ్ జూనియర్స్, క్యాడెట్ విభాగాల్లో 500 మంది క్రీడాకారులు హాజరు
- అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి: డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రాష్ట్ర స్థాయి బాల, బాలికల ఫెన్సింగ్ పోటీలు నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే పోటీలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.నాగేశ్వరరావు, కృష్ణమోహన్ ప్రారంభించారు. సబ్ జూనియర్స్, క్యాడెట్ విభాగాల్లో మొదటిగా ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్‌తో నిర్వహించే పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 500 మంది క్రీడాకారులు హాజరయ్యారు. లీగ్ పద్ధతిలో మొదటిరోజు సబ్ జూనియర్స్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో క్రీడాకారులు పోటాపోటీగా తలపడ్డారు. సబ్ జూనియర్స్ పోటీల్లో విజేతలకు శనివారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం చేయనుండగా... క్యాడెట్ విభాగంలో ఆదివారం సాయంత్రం నిర్వహించే పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం చేయనున్నారు. రాష్ట్రస్థాయి పోటీల చైర్మన్, సీతం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు నేతృత్వంలో వక్రీడాకారులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

నేటి తరం క్రీడాకారులు విద్య పాటు క్రీడల్లో రాణించాలని, తమకిష్టమైన అంశంలో నిత్య సాధన చేస్తూ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. క్రీడాపోటీల ప్రారంభం అనంతరం ఆయన మాట్లాడారు. పూర్వం కత్తియుద్ధంగా చెప్పుకునే నేటి తరం ఫెన్సింగ్ క్రీడకు ఆదరణ బాగుందన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్ కోచ్ డి.వి.చారిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేటర్లు కంటుభుక్త తవిటిరాజు, కనకల నాగవల్లి, సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్, డీఎస్‌డీఓ అచ్యుతరావు, వివిధ జిల్లాలకు చెందిన ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

గిరిజనం ఇంట ఉ'సిరి'

- మన్యంలో ఉసిరి సీజన్ ఆరంభం
- కిలో రూ.30 నుంచి రూ.40 వరకు అమ్మకాలు

సీతంపేట: ఏజెన్సీలో ఉసిరి సీజన్ ఆరంభమైంది. సుమారు వెయ్యి ఎకరాల్లో సాగుచేసిన ఉసిరి పంట చేతికొచ్చింది. గిరిజన రైతులు వారపు సంతలు, మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. కావిడ ఉసిరికాయలు రూ.900వరకు విక్రయిస్తున్నారు. కిలో రూ.30 నుంచి రూ.40 వరకు ధర పలుకుతోంది. ఇక్కడ పండిన పంట నాణ్యమైనది కావడంతో ఖమ్మం, తూర్పుగోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిసా ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించిందని, పంట ఆశాజనకంగా ఉందని గిరిజన రైతులు ఎస్.గంగారావు, ఎస్.మోజేషు తదితరులు తెలిపారు. ధరలు కూడా బాగున్నాయని, ఇవే ధరలు సీజన్ ఆఖరు వరకు కొనసాగితే మంచి ఆదాయం వస్తుందన్నారు.



సీతంపేట మార్కెట్‌లో ఉసిరికాయలు

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


అశోక్‌వర్ధన్ మృతదేహం

గంట్యాడ: మండల కేంద్రానికి చెందిన సిడగం అశోక్‌వర్ధన్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ఇంట్లో లేని సమయంలో శుక్రవారం మధ్యాహ్నం ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. సాయంత్రం కుటుంబసభ్యులు ఇంటికి వచ్చిన తరువాత ఫ్యాన్‌కు వేలాడుతున్న అశోక్‌వర్ధన్‌ను చూసి పోలీసులకు సమాచారం అందజేయగా పోలీసులు వచ్చి పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు. అయితే యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

విజయనగరం క్రైమ్: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మెసానిక్‌టెంపుల్ బయట గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు శుక్రవారం తెలిపారు. ఫోన్ ద్వారా వచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామని, మృతుడి వయసు సుమారు 60 నుంచి 75 ఏళ్లు ఉండవచ్చని సీఐ చెప్పారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని, సంబంధీకులెవరైనా గుర్తిస్తే తమను సంప్రదించాలని కోరారు.

భర్త అదృశ్యం


అదృశ్యమైన బంగారయ్య

విజయనగరం క్రైమ్: నిత్యం తప్పతాగి ఇంటికివస్తున్నాడని భార్య మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిన భర్త తిరిగి రాకపోవడంతో చేసేది లేక ఆమె టూటౌన్‌పోలీసులకు శుక్రవారం ఫిర్యాదుచేసింది. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక అయ్యకోనేరు దక్షిణగట్టు వద్ద నివాసం ఉంటున్న మామిడి బంగారయ్య రిక్షా కార్మికుడు. నిత్యం తప్పతాగి ఇంటికి రావడంతో కుటుంబసమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని భార్య లక్ష్మి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన బంగారయ్య నవంబరు 17న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఆమె టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 7780422640ను సంప్రదించాలని కుటుంబసభ్యులు కోరారు.

పోలీసుల సంక్షేమానికి కృషి


సీహెచ్.వెంకటరావుకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుల సంక్షేమానికి తామెప్పుడూ పూర్తి స్థాయిలో కృషిచేస్తున్నామని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. చేయూతలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన సీహెచ్.వెంకటరావుకు హోంగార్డుల ఒక్కరోజు జీతం చేయూత కింద సేకరించిన రూ. 3 లక్షల 50వేల 30 రూపాయల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ యూనివర్స్, ఆర్ అడ్మిన్ టి.శ్రీనివాసరావు, కార్యాలయ పర్యవేక్షకుడు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

11న సర్టిఫికెట్ల పరిశీలన

- పౌరసరఫరాల సంస్థలో కాంట్రాక్ట్ పద్ధతిన పోస్టుల నియామకం

విజయనగరం అర్బన్: జిల్లా పౌరసరఫరాల సంస్థలో కాంట్రాక్ట్ పద్ధతిలో అకౌంటెంట్ గ్రేడ్-3 పోస్టులకు నియామకం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలన కోసం డిసెంబరు 11న హాజరు కావాల్సని సంస్థ జిల్లా మేనేజర్ మీనాకుమారి తెలిపారు. తుఫాన్ కారణంగా ఈ నెల 8వ తేదీన ఈ అభ్యర్థులకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలియజేశామని, అయితే 11వ తేదీన హాజరయ్యేందుకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కూడా అదే రోజు జరుగుతుందని పేర్కొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹90	₹150	₹160

మా సొమ్ము ఏమైందో..!

నీలగిరి తోటలు, పెద్ద పెద్ద చెట్లు ఉండడంతో ఆ ప్రదేశం నిర్మానుష్యంగా ఉంటుంది. ఆ ప్రదేశానికి సుమారు వంద మీటర్ల దూరం వరకు ఎటువంటి నివాసాలు లేవు. అదే ప్రదేశంలో స్టేట్ బ్యాంక్ బ్రాంచిని ఏర్పాటు చేశారు. ఈ బ్యాంకులో సులువుగా దొంగతనం చేసేందుకు దుండగులకు వీలుంటుంది. ఈ బ్యాంకులో గల ఏటీఎంలో గతంలో దొంగలు గ్యాస్ కట్టర్‌లతో కట్‌చేసి చెల్లాచెదురు చేసిన ఘటనలు ఉన్నాయి. ఈ బ్యాంక్‌కు రాత్రి కాపలాదారు లేకపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా గురువారం రాత్రి ఈ బ్రాంచిలో చోరీకి దుండగులు విఫల యత్నం చేయడంతో ఖాతాదారులు అంతా కలిసి బ్రాంచ్ మేనేజర్‌పై విరుచుకుపడ్డారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. – కొత్తవలస

- ఎస్‌బీఐ ఖాతాదారుల ఆందోళన
- ఎస్‌బీఐలో చోరీకి దుండగుల విఫలయత్నం
- పోలీసుల రాకతో దొంగల పరారీ
- బ్రాంచ్ మేనేజర్‌పై కస్టమర్ల ఆగ్రహం



నిర్మానుష్య ప్రాంతంలో స్టేట్ బ్యాంకు భవనం


బ్యాంకు కిటికీ ఊచలను కట్‌చేసి లోనికి ప్రవేశించిన మార్గం

కొత్తవలస మండలంలోని చింతలపాలెం గ్రామం సమీపంలో గల స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో గురువారం రాత్రి దొంగలు చోరీకి విఫల యత్నం చేశారు. ఎప్పటిలాగానే బ్యాంకులో లావాదేవీలు పూర్తయిన తరువాత తాళాలు వేసుకుని సిబ్బంది సాయంత్రం వెళ్లిపోయారు. అయితే రాత్రి 11 గంటలు దాటిన తరువాత బ్యాంకు భవనానికి ఉత్తరం వైపు గల కిటికీ ఊచలను గ్యాస్ కట్టర్‌తో తొలిగించి బ్యాంకులోపల గల స్ట్రాంగ్ రూమ్‌లోకి దుండగులు ప్రవేశించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లాకర్‌లను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి ఓపెన్ చేశారు. అయితే అందులో కేవలం దస్త్రాలు మాత్రమే ఉన్నాయి. గ్యాసకట్టర్‌తో కట్ చేసిన సమయంలో కొన్ని దస్త్రాలు కూడా కాలిపోయాయి. దీంతో పక్కనే గల మరో లాకర్‌ను ఓపెన్ చేయకుండా బ్యాంకు గదిని ఆనుకుని ఉన్న ఏటీఎంలోకి చొరబడి గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను పూర్తిగా కాల్చి ఓపెన్ చేశారు. ఆ సమయంలో ఇక్కడి ఏటీఎంకు ముంబైలోని ప్రధాన కార్యాలయానికి అనుసంధానం చేసిన అలారం మోగడంతో అక్కడి సిబ్బంది అలెర్ట్ అయి బ్యాంకు మేనేజర్ ఒ.వి.చంద్రశేఖర్‌ను ఫోన్‌లో అప్రమత్తం చేశారు. దీంతో ఆయన వెంటనే స్థానిక ఎస్సైకి విషయం చేరవేయగానే రాత్రి గస్తీ పోలీసులు హుటాహుటిన బ్యాంకు వద్దకు చేరుకోగా గమనించిన దుండగులు జారుకున్నారు. పోలీసులు రావడం ఏమాత్రం ఆలస్యమైనా ఏటీఎంలో గల సుమారు రూ.20లక్షలు దొంగల పాలయ్యేవని బ్యాంకు మేనేజర్ తెలిపారు. బ్యాంకులోకి ప్రవేశించిన దొంగలు కొన్ని బీరువాలకు గల తాళాలను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి చెంతనే గల తుప్పల్లో పారేశారు. అలాగే బ్యాంకులో గల కొన్ని కంప్యూటర్లను ధ్వంసం చేశారు. సీసీ కెమెరాలను విరగ్గొట్టి రికార్డింగ్ అయ్యే డీవీఆర్‌ను తమతో తీసుకుపోయారు.

చోరీ జరగలేదు

దొంగలు అధునాతన పరిజ్ఞానంతో చోరీకి పాల్పడి విఫలమయ్యారని బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. బ్యాంకులో కొన్ని దస్త్రాలు కాలిపోయాయి తప్పితే ఒక్క రూపాయి కూడా చోరీకి గురికాలేదని స్పష్టం చేశారు. దీంతో అక్కడికి చేరుకున్న ఖాతాదారులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం మేరకు విజయనగరం నుంచి ప్రత్యేక క్లూస్ టీమ్ వచ్చి బ్యాంకులోను, ఏటీఎంలో వేలి ముద్రలను సేకరించింది. కొత్తవలస సీఐ ఎస్.చంద్రశేఖర్ సిబ్బందితో వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బ్యాంకు మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


బ్యాంకులో వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్‌టీమ్


బ్యాంకు మేనేజర్‌ను నిలదీస్తున్న ఖాతాదారులు

21న మొదటి విడత 'నాడు–నేడు' పునఃప్రారంభం


మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి


హాజరైన ఎంఈఓలు, ఇంజినీరింగ్ సిబ్బంది

- ఎస్ఎంఎఫ్‌తో మిగులు పనులు పూర్తి
- నాడు–నేడు పనులపై సమీక్షించిన కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మొదటి విడత నాడు–నేడు మోడిఫికేషన్ పనులను పూర్తి చేసుకుని ఈ నెల 21వ తేదీన వాటిని పునఃప్రారంభించనున్నామని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. ఇటీవల విడుదల చేసిన స్కూల్ మెయింటనెన్స్ ఫండ్ (ఎస్ఎంఎఫ్)లో తుది పనులను ఈ లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. నాడు నేడు కింద తొలి విడతలో 840 పాఠశాలలను పూర్తి చేశామని ఆ పనులలో అదనపు భవనాలతోపాటు టాయిలెట్స్, తాగునీరు. చిన్న చిన్న మరమ్మతులు, తదితర అభివృద్ధి పనులు చేపట్టామని, వాటన్నిటినీ పూర్తి చేసుకుని ఈ నెల 21న ప్రారంభించి ఆయా స్కూల్స్‌కు అంకితం చేయనున్నామని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నాడు నేడు పనుల పురోగతిపై ఎంఈఓలు, ఇంజినీర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రివాల్వింగ్ ఫండ్ కోసం వివరాలను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఈ నెల 20 తర్వాత నిధులు విడుదలవుతాయని తెలిపారు. అలాగే రెండవ దశ–బి కింద 700 అంగన్వాడీ కేంద్రాలను నిర్మించడానికి అంచనాలను వారం లోగా పంపించాలని కోరారు. రెండవ దశలో మొదటిగా అంగన్వాడీ కేంద్రాలను పూర్తి చేయాలని తదుపరి అదనపు తరగతి గదులు, మేజర్, మైనర్ మరమ్మతులను, కిచెన్ షెడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు.

డిసెంబర్‌లో సెలవులు రద్దు చేయాలి

ఇటీవల తుఫాన్‌ల సందర్భంగా 3 రోజులపాటు పాఠశాలలకు సెలవులను ప్రకటించామని అయితే సిలబస్ పూర్తి చేయడానికి ఈనెలలో వచ్చే సెలవులను రద్దు చేసి పాఠశాలలను నడపాలని ఆదేశించారు. 10వ తరగతి కోసం వంద రోజుల ప్రణాళికను తయారు చేసి ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి పాఠశాలలో శతశాతం ఫలితాలు వచ్చేలా చూడాలని రెసిడెన్షియల్ స్కూల్స్‌లోనూ తప్పనిసరిగా వంద శాతం ఫలితాలు రావాలఅన్నారు. వెనుకబడి ఉన్న సబ్జెక్టుల్లో ప్రత్యేక తరగతులను నిర్వహించాలని పరీక్ష ప్రాతిపదికగానే ఇకపై తరగతులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీఈఓ బి.లింగేశ్వర రెడ్డి, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, ఎంఈఓలు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


పోక్సో కేసులో ముద్దాయికి 20ఏళ్ల జైలు



ముద్దాయి గుమ్మిడి ఆదినారాయణ

విజయనగరం క్రైమ్: పోక్సో కేసులో విచారణ అనంతరం ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.రెండువేలు జరిమానా విధిస్తూ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం తీర్పు విధించిందని ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి.

గుర్ల మండలంలోని గరికివలస గ్రామానికి చెందిన గుమ్మిడి ఆదినారాయణ ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దిశ మహిళా పోలీస్‌స్టేషన్‌లో 2023 ఫిబ్రవరిలో పోక్సో చట్టం ప్రకారం ఎస్సై ఎస్.పద్మావతి కేసు నమోదుచేశారు. అప్పటి దిశ మహిళా డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు దర్యాప్తు చేపట్టి, నిందితుడ్ని అరెస్టుచేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. ఈ కేసును ప్రాధాన్యత జాబితాలో చేర్చి, తొమ్మిది నెలల్లోనే ప్రాసిక్యూషన్ పూర్తయ్యేలా చర్యలు చేపట్టగా విచారణలో నేరం రుజువు కావడంతో ఆదినారాయణను ముద్దాయిగా నిర్ధారించారు. ఈ మేరకు స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు కె.నాగమణి ముద్దాయికి 20 ఏళ్ల కఠిన కారాగారం, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. పోలీసుల తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించగా, దిశ మహిళా పోలీస్‌స్టేషన్ ప్రస్తుత డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు , ఇన్‌స్పెక్టర్ బి.నాగేశ్వరరావు పర్యవేక్షణలో కోర్టు హెడ్ కానిస్టేబుల్ బి.దివ్యజ్యోతి, సీఎంఎస్ హెచ్‌సీ రామకృష్ణ సాక్షులను కోర్టులో హాజరుపరిచారు.

వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కోఆర్డినేటర్లు వీరే


శంబంగి శ్రీకాంత్


బూర్లె నరేష్


గుల్లిపల్లి గణేష్


వి.టి.సూర్యనారాయణ థాత్రాజ్ (బాచీ)

విజయనగరం/పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీలో సంస్థాగత నియామకాల్లో భాగంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు జేసీఎస్ కో ఆర్డినేటర్లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరం జిల్లా జేసీఎస్ కో ఆర్డినేటర్లుగా బొబ్బిలి నియోజకవర్గానికి చెందిన శంబంగి శ్రీకాంత్, చీపురుపల్లి నియోజకవర్గం మెరకముడిదాం మండలానికి చెందిన బూర్లె నరేష్‌కుమార్‌లను నియమించింది. శంబంగి శ్రీకాంత్ బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కుమారుడు. విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకున్నాడు. బూర్లె నరేష్ 2006 నుంచి 2011 వరకు సర్పంచ్‌గా, మండల సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 2022 నుంచి జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

- వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్లుగా గుల్లిపల్లి గణేష్, వి.టి.సూర్యనారాయణథాత్రాజ్ (బాచీ) నియామకమయ్యారు. గుల్లిపల్లి గణేష్ ఇప్పటి వరకు వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు.
- వి.టి.సూర్యనారాయణ థాత్రాజ్ (బాచీ) 2014, 2019లో జరిగే సాధారణ ఎన్నికల్లో పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలను, నాయకులను సమన్వయం చేస్తూ పార్టీని విజయపథంలో నడిపించారు.

రాజాంలో చోరీ


రామారావు ఇంట్లో చోరీ జరిగిన గదులను పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

రాజాం సిటీ: స్థానిక గాంధీనగర్‌లో ఉంటున్న విశ్రాంత ఎస్‌సీసీ అధికారి ఆకిరి రామారావు ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఈ చోరీ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆకిరి రామారావు కుటుంబంతో కలిసి బెంగళూరులోని తన కుమారుడి వద్దకు పదిరోజుల క్రితం వెళ్లారు. ఇది గమనించిన దొంగలు గురువారం రాత్రి ఇంటి మెయిన్ గేటు తాళం పగలగొట్టి లోనికి చొరబడ్డారు. ఉదయం చుట్టుపక్కలవారు గుర్తించి రామారావుకు సమాచారం ఇవ్వడంతో పాటు పోలీసులకు ఫిర్యాదుచేశారు. సమాచారం మేరకు రాజాం టౌన్ సీఐ రవికుమార్, ఎస్సై రవికిరణ్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరాతీశారు. రామారావుకు ఫోన్ చేసి పలు విషయాలు సేకరించడంతో పాటు రాజాం చుట్టుపక్కల ఉంటున్న రామారావు బంధువులను చోరీ జరిగిన ఇంటి వద్దకు రప్పించారు. ఇంట్లోకి వెళ్లి చోరీ జరిగిన ప్రాంతాలను గుర్తించారు. ఇంట్లోని అన్ని గదుల్లో బీరువాలు పగలగొట్టి ఉండడం, బెడ్‌రూమ్‌ల్లో అన్ని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండడాన్ని గమనించారు. నగదు, బంగారు ఆభరణాలు వంటివి ఎంతమేర అపహరణకు గురయ్యాయన్నది తెలియరావడంలేదు. మరోవైపు బెంగుళూరులోని బాధితులు ఇక్కడికి వచ్చేందుకు బయలుదేరారు. సీసీ కెమెరాలు, పుటేజీలు, డీవీఆర్ సిస్టమ్ కూడా చోరీకి గురికావడంతో ఇది ఘరానా దొంగలపనేనని పోలీసులు భావిస్తున్నారు. క్లూస్ టీం రంగంలోకి దిగి వివరాలు సేకరిస్తోంది. టౌన్ సీఐ రవికుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

మరో ఇంట్లో..

ఇదిలా ఉండగా పట్టణంలోని బాబానగర్ 4వ లైన్‌లో తిరిశెట్టి ప్రవీణ్ ఇంట్లో కూడా గురువారం రాత్రి చోరీ జరిగినట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. ప్రవీణ్ కుటుంబం రెండునెలలుగా ఇక్కడ ఉండడంలేదని, ఇంటి తలుపులకు తాళాలు వేసి ఉండేవని, శుక్రవారం తాళాలు పగలగొట్టి ఉండడంతో ఆ ఇంట్లో కూడా చోరీ జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఈ విషయంపై రాజాం పట్టణ సీఐ రవికుమార్ మాట్లాడుతూ ప్రవీణ్ ఇంట్లో చోరీపై ఎటువంటి సమాచారం లేదన్నారు. ఇంటిని పరిశీలించి ఆరాతీస్తామని చెప్పారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ


దీపారాధన వేదికపై ఊయలలో శ్రీ సీతారామచంద్రస్వామి

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం రాత్రి కనులపండువగా జరిపించారు. వెండి మంటపంలో ఉన్న శ్రీ సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణ నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మంటపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో వేంచేపుజేశారు. అనంతరం దీపాలను వెలిగించి, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర దీపాల శోభలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్‌కుమారాచార్యులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి జేఎన్‌టీయూ జీవీలో 'ఫ్యాకల్టీ శిక్షణ'


పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ అండ్ కన్సారియమ్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (సీటీఈ) అండ్ ఏపీఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ (ఏపీఐటీఏ) సంయుక్త నిర్వహణలో ఈనెల 18 నుంచి స్థానిక జేఎన్‌టీయూ జీవీ ప్రాంగణంలో ఐదు రోజుల పాటు ఫాకల్టీ కోసం ఐదు రోజుల పాటు ఉచిత అంతర్జాతీయ స్వల్పకాలిక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన చాంబర్‌లో ప్రచార పోస్టర్, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. శిక్షణలో పాల్గొనడానికి నమోదు చేసుకోవాల్సిన ఆన్‌లైన్ లింక్ వివరాలను విడుదల చేశారు. ఈ నెల 10వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు విండోస్ 10 లేదా 11 వెర్షన్ కలిగిన ల్యాప్‌టాప్స్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ఆడిట్ ప్రొఫెసర్ రాజేశ్వరరావు, శిక్షణ కార్యక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ పి.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఈవీఎంపై అవగాహన కేంద్రం


అవగాహన కేంద్రాన్ని ప్రారంభించిన డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత

విజయనగరం అర్బన్: ఓటు హక్కు వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ ప్రాంగణంలో 'ఈవీఎంపై ఓటర్లకు అవగాహన కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈవీఎం వినియోగంపై అపోహలు పోగొట్టడానికి బహిరంగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కలెక్టరేట్‌కు వచ్చి పోయే ప్రజలు నిత్యం ఉంటారని ఈవీఎంపై సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో ఈ అవగాహన కేంద్రం మూడు నెలల పాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనకే జాబ్‌మేళా


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకే ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళాలు నిర్వహించనున్నట్లు పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో ఈనెల 15న నిర్వహించనున్న జాబ్‌మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి యు.సాయికుమార్ మాట్లాడుతూ ఈ మేళాకు 16 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. పదోతరగతి నుంచి బీటెక్, ఎంఎస్‌సీ చదివిన అభ్యర్థులు స్కిల్ యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 6305110947, 6303493720 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాయత్రి కళాశాల కరెస్పాండెంట్ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.